క్లుప్తంగా

పీఆర్ ఏఈకి మెమో జారీ

నార్కట్‌పల్లి: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై పర్యవేక్షించని నార్కట్‌పల్లి పీఆర్ ఇన్‌చార్జి ఏఈ భరత్‌చంద్రకు మెమో జారీ అయినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంచాయతీ రాజ్ శాఖ పనులపై పర్యవేక్షణ ఏదీ? అని సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనంపై ఆ శాఖ జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు పనులను పర్యవేక్షించుకుండా నిర్లక్ష్యం వహించిన పీఆర్ ఇన్‌చార్జి ఏఈకి మెమో జారీచేసి నివేదిక ఇవ్వాలని ఈనెల 14న ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దు

నాంపల్లి: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంధం మోహన్‌రావు అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టూడెంట్ కౌన్సిలింగ్ గదిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉత్పన్నమయితే స్టూడెంట్ కౌన్సిలర్ల దృష్టికి తేవాలని సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెలీమానస్ 14416 ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్లు రజనీకాంత్, సృజన్ కుమార్, అధ్యాపకులు వెంకన్న, శ్రీనివాస్, ముత్యాలు, శిరీష, సైదయ్య, బ్రహ్మాచారి, మహేశ్వర్‌రెడ్డి, లోకేష్, మధుసూదన్, రజియా బేగం, శివకుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

రామగిరి(నల్లగొండ): హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న అనిల్ కుమార్ బోగా, హనుమాన్ నాయక్‌పై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి దాడులను ఆపాలంటే వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఆల్ ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా నాయకులు పందిళ్లపల్లి బ్రహ్మచారి, తండు వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, భీమగాని గణేష్, వంశీకృష్ణ, సయీద్ రఫీ, నితీష్, నరసింహ, శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల ముందస్తు అరెస్ట్

చిట్యాల: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న స్పాట్ బిల్లింగ్ కార్మికుల(మీటర్ రీడింగ్ కార్మికులు) సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాలో పాల్గొకుండా చిట్యాల విద్యుత్ శాఖలో పనిచేస్తున్న స్పాట్ బిల్లింగ్ కార్మికులను స్థానిక పోలీసులు శనివారం ముందుస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన కార్మికులను వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో స్పాట్ బిల్లింగ్ కార్మికులు బత్తుల చంద్రశేఖర్, జడల అనిల్, సిలివేరు బాలకృష్ణ, పాకాల మురళి, వెంకటాచారి, శ్రీకాంత్, మధుకర్ పాల్గొన్నారు.

సతీష్ నిజాయితీకి ఎస్ఐ అభినందన

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి బస్టాండ్‌లో శనివారం పాలెం సతీష్ అనే వ్యక్తికి రూ.5 వేలు, వివిధ కార్డులు ఉన్న పర్సు దొరికింది. దీంతో ఆయన వెంటనే నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ క్రాంతికుమార్‌కు ఆ పర్సును అప్పగించారు. విచారణ జరిపిన ఎస్ఐ.. ఆ పర్సును పామనగుండ్ల వెంకన్నదిగా గుర్తించి అప్పగించారు. సతీష్ నిజాయితీని ఎస్ఐ అభినందించారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నార్కట్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాల ఆన్‌లైన్ నమోదుకు పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సర్వే వేగవంతమైంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల నిర్మాణ ప్రగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను 532 ఇళ్లు మంజూరు కాగా అందులో 450 ఏళ్లకు మార్కింగ్ ఇచ్చినట్లు, 200 ఇళ్లకు బేస్‌మెంట్ వరకు పనులు జరుగుతున్నాయని హౌసింగ్ ఏఈ ఇందు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

మునుగోడు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని బ్యాగ్ ఏ సోయిల్ కో ఫౌండర్ మక్కెన గిరీష్‌చౌదరి కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న అవగాహన సదస్సులకు హాజరు కావాలని శనివారం ఆయన మునుగోడులోని ప్రభు త్వ అధికారుల తోపాటు పలువురు పార్టీల నాయకులని కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం

నార్కట్‌పల్లి, మర్రిగూడ: నార్కట్‌పల్లి మండలం మాండ్ర, తిరుమలగిరితోపాటు మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకలు

నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా టీచర్లు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను తెచ్చి స్కూళ్లు, కళాశాలల ఆవరణల్లో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ సంతోషంగా ఆడిపాడారు. దీంతో ఆయా విద్యాసంస్థల్లో సందడి వాతావరణం నెలకొంది. - సాక్షి నెట్‌వర్క్


రామగిరి : నల్లగొండ ఎన్జీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న యువతులు


నల్లగొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


కట్టంగూర్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..


నల్లగొండ : ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో పాల్గొన్న ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ శశికళ, విద్యార్థినులు


నాంపల్లి : మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో..


రామగిరి : చర్లపల్లిలోని ఓక్ ట్రీ పాఠశాలలో..


కేతేపల్లి : డీపాల్ పాఠశాలలో..


నల్లగొండ : షేర్‌బంగ్లాలోని మాల్‌బౌలి ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో..


చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


నల్లగొండ టూటౌన్ : సాందీప్ హైస్కూల్‌లో..


రామగిరి : నల్లగొండలోని వేదాంత పాఠశాలలో..


మునుగోడు : ఎస్ఎస్ఆర్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


మర్రిగూడ : జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


నల్లగొండ: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


కేతేపల్లి : గుడివాడ పాఠశాలలో..


నకిరేకల్ : శాస్త్ర పాఠశాలలో..


నకిరేకల్ : వీవీఎం ఉద్దీపన పాఠశాలలో..


చిట్యాల: వెలిమినేడు విజయవాణి స్కూల్‌లో..


కట్టంగూర్ : సాందీపని పాఠశాలలో..

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి


ఇటుకులపహాడ్‌లో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు సకాలంలో పూర్తిచేయాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. 'సాక్షి' దినపత్రికలో శనివారం నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి ఇటుకులపహాడ్ గ్రామాన్ని సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో మూగ దివ్యాంగులైన అక్కాతమ్ముళ్లు జిల్లోజు పూలమ్మ, జిల్లోజు రాములుకు ప్రభుత్వం జారీ చేసిన సదరం ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఏపీఎం శంకరయ్య, ఏపీఓ జంగమ్మ, సుల్తాన్ యల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నార్కట్‌పల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అక్కెనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ వరుధిని అన్నారు. శనివారం అక్కెనపల్లి పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్‌లు నికితారెడ్డి, పద్మ, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఫ్లడ్ లైట్లు

నకిరేకల్ : నకిరేకల్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం నిర్వహించనున్న ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకల సందర్భంగా మార్కెట్ ఆవరణలో శనివారం మున్సిపల్ సిబ్బంది ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయించారు. ఈ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులతో ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, ఫుట్‌బాల్ జిల్లా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పరిధిలోని చర్లపల్లిలో గల విపస్యా స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ ఎంపికై న క్రీడాకారులను ఈనెల 25 నుంచి 28 తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నార్వే దేశంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న లావణ్యకు డి.లైసెన్స్ కోసం రూ.25 వేలను ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్, ఫుట్‌బాల్ కోచ్‌లు కందికట్ల దాస్, బొడ్డుపల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన విచారణ

- పామనగుండ్ల పంచాయతీ కార్యదర్శిపై గతేడాది ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- కార్యదర్శి మద్దతుదారులను విచారణ చేయడంతో ఒప్పుకోని ఫిర్యాదుదారులు

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల గ్రామ కార్యదర్శి టి.జయసుధపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శుక్రవారం విచారణ జరపాల్సి ఉన్నా నిలిచిపోయింది. కార్యదర్శి పలు పనుల్లో అవినీతి, అవకతవకలకు పాల్పడిందని అదే గ్రామానికి చెందిన బి.గణేష్‌తో పాటు పలువురు గ్రామస్తులు.. జిల్లా కలెక్టర్‌కు, డీపీఓ, డీఆర్‌డీఓలకు నవంబర్ 11, 2024న ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ గతనెల 25న విచారణ చేపట్టారు. మరలా ఈ నెల 19న డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు విచారణ చేసేందుకు వచ్చారు. ఫిర్యాదుదారులతో పాటు కార్యదర్శికి మద్దతు పలికే వ్యక్తులతో విచారణ చేపడతాని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఫిర్యాదుదారులు ఒప్పుకోకపోవడంతో అక్కడ నుంచి డీఎల్‌పీఓ వెళ్లిపోవడంతో విచారణ నిలిచిపోయింది. ఆయన వెంట ఎంపీఓ స్వరూపరాణి, కార్యదర్శి జయసుధ ఉన్నారు.

చేయూత పింఛన్‌లు పెంచాలని ధర్నా


చిట్యాల : ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు

చిట్యాల: ఇచ్చిన హామీ మేరకు చేయూత పింఛన్‌లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పింఛన్‌దారులు శనివారం చిట్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కావలి కృష్ణ, వీహెచ్‌పీఎస్ మండల ఇన్‌చార్జి నాగరాజు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు నోముల పురుషోత్తం, పాల కృష్ణ, లింగయ్య, రాములు, నర్సింహ, యాదయ్య, నర్సమ్మ, పెంటమ్మ, పార్వతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గట్టుప్పల్ : వృద్ధులకు, వికలాంగులకు ప్రభుత్వం చేయూత పింఛన్‌లు పెంచాలని ఎమ్మార్పీఎస్ గటుప్పల్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొద్దు గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఖమ్మం చంద్రయ్య, దుబ్బాక మల్లేష్, ఖమ్మం శ్రీనివాస్, ఖమ్మం ముత్తమ్మ, చంద్రమ్మ, దుబ్బాక యాదమ్మ, కుర్మతి సాయిలమ్మ, శ్రీశైలం, నరేష్, రాజశేఖర్, సందీప్, ఎర్ర కుమార్, ప్రభాకర్, శంకర్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: వికలాంగ, చేయూత పింఛన్ల పెంపును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ శాలిగౌరారం మండల ఇన్‌చార్జి బట్ట శ్రీను డిమాండ్ చేశారు. పింఛన్ల పెంపు కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం గ్రామపంచాయతీల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామకార్యదర్శి విజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ప్రతినిధులు, స్థానిక నాయకులు బట్ట సైదులు, జీడికల్లు, వెంకటేశ్వర్లు, రాములు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

నార్కట్‌పల్లి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవప్రదమైనదని నార్కట్‌పల్లి ఎంఈఓ కూకుట్ల నరసింహ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ సన్మానించి మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య నార్కట్‌పల్లిలోని లక్ష్మీపురం పాఠశాలకు భూదానం చేసి తన ఉదారతను చాటుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీసీఓ బాజామురళి, సీఆర్‌పీలు నరసింహ, శంకర్, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గట్టుప్పల్ అభివృద్ధి


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

గట్టుప్పల్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో గట్టుప్పల్ మండలంలో అభివృద్ధి జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ మండల ముఖ్యుల సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దండు యాదగిరిరెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సంపత్, మల్లేష్, యాదయ్య, ఆంజనేయులు, గిరి శంకర్, బుచ్చయ్య, యాదయ్య, శంకర్, పర్వతాలు పాల్గొన్నారు.

వెల్దండి శ్రీధర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


శ్రీధర్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

రామగిరి(నల్లగొండ): రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందిన నల్లగొండ ఎన్జీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్‌ను ఇతర అధ్యాపకులు స్ఫూర్తిగా తీసుకుని సేవలందించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత డాక్టర్ వెల్దండి శ్రీధర్‌ను శనివారం కళాశాల స్టాఫ్ క్లబ్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. కవిగా, కథా రచయితగా, విమర్శకుడిగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీధర్ మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవికుమార్, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ జి.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ వైవీఆర్. ప్రసన్న కుమార్, డాక్టర్ మల్లేశం, కోటయ్య, కందుకూరి దుర్గాప్రసాద్, డాక్టర్ సైదులు, డాక్టర్ భూపాల్, డాక్టర్ మునిస్వామి, డాక్టర్ సి.జ్యోత్స్న, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగరాజు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దేవీనవరాత్రుల ప్రచార కరపత్రాలు విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : నకిరేకల్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో ఈనెల 22 నుంచి నిర్వహించనున్న దేవీశరన్న నవరాత్రుల ఉత్సవాల ప్రచార కరపత్రాలను శనివారం రాత్రి నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, సీఎసీఎస్ చైర్మన్ నాగులంచ వేంకటేశ్వరరావు, ఆలయ చైర్‌పర్సన్ బ్రహ్మాదేవర పద్మావతి పాల్గొన్నారు.

సాయి మందిరంలో..

నకిరేకల్‌లోని శ్రీ షీరిడిసాయి మందిరంలో ఈనెల 22 నుంచి నిర్వహించనున్న దేవి నవరాత్రులు, విజయదశమి వేడుకల ప్రచార కరపత్రాలను ఆలయ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు శనివారం రాత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, ప్రతినిధులు ఉప్పల వెంకటరమణ, తోనుపూనురి రాంబాబు, వలిశెట్టి స్వప్నా, బండారు వేణుగోపాల్, జోరిగల శ్రీనివాస్‌లు, పిల్లల మర్రి సునీత, వలిశెట్టి భిక్షం, దాచేపల్లి శ్రీనివాస్, ఆలయ పూజారి దుర్గి మురళిదర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కనగల్: మండలంలోని చిన్నమాదారం గ్రామ హైస్కూల్‌లో మీన్స్ మెరిట్స్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను శనివారం పల్‌రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్‌రెడ్డి రాంరెడ్డి విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ప్లే గ్రౌండ్‌లో మట్టిని పోయించి విద్యార్థులు ఆడుకునేందుకు చదును చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం విద్యార్థులకు ప్రగతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంజులత, కొండ శ్రీనివాస్, సబావత్ వెంకట్‌కుమార్, మీనా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు రక్షణకు పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న వంగూరి రాములు

నల్లగొండ టూటౌన్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు రక్షణకు ఈ నెల 23న లేబర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటమరాజు అన్నారు. శనివారం నల్లగొండలో జరిగిన సీఐటీయూ సమావేశంలో వారు మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.9 వేల కనీస పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని కార్మికుల ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు సంక్షేమ బోర్డు ద్వారా ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం, సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, ఏర్పుల యాదయ్య, అవుట రవీందర్, పోలె సత్యనారాయణ, వరికుప్పల ముత్యాలు, శంకర్, సాగర్ల మల్లయ్య, సైదాచారి, నాగరాజు, అద్దంకి నరసింహ, లింగస్వామి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఐదు గేట్ల ద్వారా 'మూసీ' నీటి విడుదల

కేతేపల్లి: ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు మూసీకి 6,791 క్యూసెక్కుల నీరు వస్తుండగా అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 7,153 క్యూసెక్కుల దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 643.50 అడుగుల వద్ద నిలకడగా ఉంచి దిగువకు నీటిని వదులుతున్నారు. ఆయకట్టులో పంటల సాగుకు మూసీ కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 624 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలకు ప్రస్తుతం 4.09 టీఎంసీల నీరుందని అధికారులు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజి వద్ద గల శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ పుష్కర ఘాట్ వద్ద సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శనివారం బీజేపీ నాయకులు శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో పిండి పాపిరెడ్డి, పంతంగి సైదులుగౌడ్, పులకరం భిక్షం, నకరికంటి శంకర్ గౌడ్, తిరందాస్ కనకయ్య, కె.వెంకట్‌రెడ్డి, దాసరి వెంకన్న, ముత్యాల మధు, వెంకన్న పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని కొట్టాల గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శివన్నగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ విజయసింహారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రిషికేష్, సిబ్బంది పాల్గొన్నారు.